www.prajasakti.com

# ప్రజాశక్తి

శుక్రవారం 6 అక్టోబర్ 2023





## చిత్తూరుపై అనంతపురం జట్టు విజయం

**ప్రజాశక్తి-కడప :** అనంతపురం జట్టుకు చెందిన యోగానంద సెంచరీ (114 పరుగులు, నాట్ అవుట్) చేయడంతో అనంతపురం జట్టు 8 వికెట్ల తేడాతో చిత్తూరు జట్టుపై ఘన విజయం సాధించింది. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్ 23 మెన్ మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మూడు రోజులపాటు కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై 8 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో చిత్తూ రు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 243 పరుగులు చేసింది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 139 పరుగులు చేసింది. 6 వికెట్ల నష్టానికి 168 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్ చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండవ ఇన్నింగ్స్ లో 44.2 ఓవర్లలో 182 పరుగులకు ఆల్ అవుట్ అయింది. 287 పరుగుల విజయ లక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 65.0 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది.

# సాగు.. సంక్షోభం



**ఖరీఫ్ సాగు సంక్షోభంలో పడింది. గతేడాది సుమారు 122 శాతంతో పోలిస్తే 78.15 శాతం సాగు భారీ అంతరం కనిపిస్తోంది. ఈలెక్కన 44 శాతం విస్తీర్ణంలోని పొలాలు బీళ్లుగా దర్శనమిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వర్షాభావం కారణంగానే పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఆగస్టులో కురిసిన వర్షపాతాన్ని మినహాయిస్తే -44 శాతం లోటు వర్షపాతం కొనసాగింది. ఆగస్టులో ఉపరితల ఆవర్తనం కారణంగా కురిసిన వర్షాల నేపథ్యంలో నేటికీ -8.6 శాతం లోటు వర్షపాతం కొనసాగు తుండడం ఆందోళన కలిగిస్తోంది.**

- **బీడుగా 62,664 ఎకరాలు**
- **78.15 శాతమే పంటల సాగు**
- **8.6 శాతం లోటు వర్షపాతం**

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 2,11,553 ఎకరాల విస్తీర్ణంలో పంటలను సాగు చేయాలనేది వ్యవసాయశాఖ లక్ష్యం. జూన్ నుంచి నేటి వరకు 391.8 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. కానీ 358 మి.మీ నమోదైంది. ఆగస్టులో ఆశాజనకమైన వర్ష పాతం నమోదైనప్పటికీ -8.6 మి.మీ నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి వర్షాభావం కారణంగా ఖరీఫ్ సాగు సంక్షోభానికి దారితీసింది. జిల్లాలోని 2,11,553 ఎకరాల విస్తీర్ణంలో1,48,889 ఎకరాల్లో మాత్రమే విత్తనం పడడం వర్షాభావ పరిస్థితుల తీవ్రతకు అద్దం పడుతోంది. మిగిలిన 62,644 లక్షల ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారింది.

### సడలని...వర్షాభావం

జిల్లాలో ఆముదం మినహా వరి సాగు దగ్గర నుంచి అన్ని పంటల సాగును పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తోంది. సాగు విసీర్ణం తగ్గుదల కారణాల్లో వర్షపాతాన్ని పరిశీలిస్తే 38.4 శాతం నుంచి -8.6 శాతం కొసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జూన్‌లో 69.2 మి.మీగానూ 38.7 మి.మీ శాతం, జులైలో 96.7 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 77.4 మి.మీ మాత్రమే నమోదైంది. ఆగస్టులో 118.4 మి.మీ వర్ష పాతం నమోదులో 105.9 మి.మీ, సెప్టెంబర్‌లో 120 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా సాధారణ నమోదు కింద 199 మి.మీ అధిక వర్షపాతం నమోదు కావడం ఉపశమనం కలిగించింది. ఆగస్టులో కురిసిన వర్షపాతం కారణంగా సుమారు 50 వేల ఎకరాల్లో విత్తనం పడినట్లు తెలుస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో అత్య ధికంగా 403.3 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. నేటికి వాస్తవ ప్రాతిపదికన 305.2 మి.మీ నమోదు కావాల్సి ఉండగా 358 మి.మీ మాత్రమే నమోదు కావడం గమనార్హం.

### అన్ని పంటల సాగూ అత్తెసరే!

జిల్లాలో అన్ని పంటల సాగు అసత్తెరేనని తెలుస్తోంది. ప్రధాన ఆహార పంట వరి 91 వేల ఎకరాలకుగానూ 45 వేల ఎకరాలను సాగును మినహాయిస్తే ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. వేరుశనగ సాగు పరిస్థితిని గమనిస్తే ఆందోళన కలిగిస్తోంది. 14,177 ఎకరాల్లో వేరుశనగ విత్తనం పడాల్సి ఉండగా 8,882 ఎకరాల్లో విత్తనం పడింది. పత్తి సాగును పరిశీలిస్తే 52,839 ఎకరాలు సాగు కావాల్సి ఉండగా 41,513 ఎకరాల్లోనే విత్తనం పడింది. గతేడాది ఇదేసమయానికి సుమారు అంచ నాకు మించిన విస్తీర్ణంలో విత్తనం పడింది. ఇదేతరహాలో మోస్తరు స్థాయిలో విత్తిన పంటల వివరాలను పరిశీలిస్తే మొక్కజొన్న 2,645 ఎకరాలు, మినుములు 7,983 ఎకరాలు, కంది 10,361 ఎకరాలు, 1,365 ఎకరాల్లో సోయాబీన్, ప్రొద్దుతిరుగుడు 627 ఎకరాలు, పసుపు 1,706 ఎకరాల్లో విత్తనం పడింది.

### 78 శాతమే సాగు!

ఖరీఫ్ సీజన్ ఎన్నడూ లేని విధంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులకు లోనైంది. 2,11,553 ఎకరాల సాగు లక్ష్యానికిగానూ 1,48,889 ఎకరాల్లో విత్తనం పడింది. ఇటువంటి క్షామ పీడిత పరిస్థితుల నేపథ్యంలో 78 శాతమే పంటల సాగుకు పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ లెక్కన 62, 664 ఎకరాలు బీళ్లుగా దర్శనమిస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. పదేళ్లకుపైగా ఇటువంటి పరిస్థితి ఎదురు కావ డంపై రైతాంగంలో నిరాశానిస్పృహలు నెలకొన్నాయని చెప్ప వచ్చు. ప్రతి ఏటా వ్యవసాయ పంటల సాగు విస్తీర్ణం పడి పోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఏటా సగటున 25 వేల ఎకరాలకుపైగా ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నట్లు వ్యవసాయశాఖ నిపుణులు పేర్కొంటున్న పరిస్థితి కని పిస్తోంది.

### కెసి ఆశలు గల్లంతు

ప్రతి ఏటా ఆగస్టు 16న కెసి కెనాల్‌కు నీటిని విడుదల చేయ డం పరిపాటి. సెప్టెంబర్ చివరి వారంలో కెసి కెనాల్‌కు నీటని విడుదల చేయలేమని అధికారులు పేర్కొనడం నిరా శను మిగిల్చింది. కెసి కెనాల్ ఆయ కట్టు పరిధిలోని 91 వేల ఎకరాల్లో పంటలు సాగుకు గానూ ఎనిమిది వేల ఎకరాల్లోనే నీటిని విడుదల చేసే అవకాశం నెలకొంది. 83 వేల ఎకరాల ఆయకట్టు బీళ్లుగా దర్శనమిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

# దారుణం

- **భార్యా పిల్లలను తుపాకీతో కాల్చి ఆపై హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య**
- **సంఘటన స్థలంలో సూసైడ్ నోట్**
- **సర్వహక్కులు రెండవ భార్యకు కల్పించాలని ఎస్‌పికి లెటర్**
- **విచారణ చేపట్టిన పోలీసులు**



హెడ్ కానిస్టేబుల్ భార్యా, పిల్లలు (ఫైల్‌ఫొటో)




మంచంపై పడి ఉన్న మృతదేహాలు




హెడ్‌కానిస్టేబుల్ ఇంట్లో విచారిస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి-కడప అర్బన్**

కడపలో విషాదం చోటుచేసుకుంది. నగరంలోని కో-ఆపరేటివ్ కాలనీలో నివాసం ఉంటూ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు(55) (హెచ్‌సి 1895) సర్వీస్ రివాల్వర్‌తో భార్య, ఇద్దరు కుమార్తెలను కాల్చి చంపిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. తాను అదే రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటిలో భార్య మాధవిలత(50), కుమార్తెలు లికిన్య(21), అభిజ్ఞ(16)ను నిద్రిస్తున్న సమయంలో రివాల్వర్‌తో కాల్చి చంపినట్లు సంఘటన స్థలంలో చోటుచేసుకున్న దృశ్యాలపు బట్టి తెలుస్తోంది. సంఘటన స్థలాన్ని డిఎస్‌పి షరీఫ్, సిఐలు, ఎస్ఐలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాపు చేపట్టారు. సంఘటన స్థలం పరిశీలించిన అనంతరం డిఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండేళ్ల నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం రాత్రి 10.30 నుంచి 11 గంటల వరకు పోలీస్ స్టేషన్‌లో ఉన్నారని చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో కస్టోడియన్, రైటర్‌గా పని చేస్తున్నారు. కస్టోడియన్ ఆధీనంలో ఆఫీసర్స్ పిస్టల్స్, ప్రాపర్టీస్ ఉంటాయని పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్‌ను బట్టి తెలు సుందన్నారు. రెండవ భార్య, కుమారుడికి బెనిఫిట్స్ చెందాలని నోట్‌లోరాసి ఉందన్నారు. నోట్ బట్టి చూస్తే కుటుంబ కలహాలు, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు స్పష్టంగా తెలుస్తుందన్నారు. దర్యాప్తులో అన్నివిషయాలు బటయటకు వస్తాయని చెప్పారు. ఆయన సొంత ఊరు పులివెందుల అన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.



ఆత్మహత్యకు ఉపయోగించిన సర్వీస్ తుపాకీ



दस रुपये
रु.10
TEN RUPEES
Rs.10
INDIA
INDIA NON JUDICIAL
ANDHRA PRADESH
THUMMALURU NARENDRA REDDY
Licenced Stamp Vendor
Nallaballi (V), Muddanur (M),
Y.S.R. District.

హెడ్‌కానిస్టేబుల్ రాసిన సూసైడ్ నోట్

### ఆత్మహత్య కారణాలను వెలికితీస్తాం : ఎస్‌పి

హెడ్ కానిస్టేబుల్ భార్యా, బిడ్డల్ని కాల్చి చంపి, తానూ పిస్టల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న కారణాలను పోలీస్ విచారణలో వెలికితీస్తామని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. రిమ్స్ మార్చురీలో ఉన్న మృతదేహాలను ఎస్‌పి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆత్మహత్యకు కారణం ఆర్థిక సమస్యలా, ఇంకా ఏమైనా ఉన్నాయా అనే వాటిపై విచారణ ప్రారంభించామని పేర్కొన్నారు.

### మృతదేహాలను సందర్శించిన డిప్యూటీ సిఎం, మేయర్

హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు ఆత్మహత్య చేసుకున్న విషయం తెసుకున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాష, మేయర్ సురేష్‌బాబు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ వెంకటేశ్వర్లను బొట్టు స్వామి అని తాము పిలిచేవారని పేర్కొన్నారు. ఆత్మహత్య బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అతను చాలా మంచివాడన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

**ప్రజాశక్తి- కడప అర్బన్**

నగరంలోని జడ్‌పి సమావేశ మందిరంలో గురువారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి జిల్లాలకు సంబంధించి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమానికి కడప కలెక్టర్ వి.విజయ్ రామరాజు, అన్నమయ్య కలెక్టర్ గిరీష్, చిత్తూరు జిల్లా జడ్‌పి చైర్మన్ శ్రీనివాసులు, తంబళ్లపల్లి ఎమ్మేల్యే పెద్ది రెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రా రెడ్డి, మేయర్ సురేష్ బాబు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్‌పి చైర్మన్ అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ మన జీవితంలో ఉన్నత స్థానం గురువుకు ఇస్తామని, మనల్ని జ్ఞానవంతులుగా తీర్చి దిద్దడంలో వారి కృషి వెలకట్టలేనిదన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని సమాజంలో చిన్న పిల్లలను క్రమ శిక్షణతో పెంచి దేశానికి బావి పౌరులుగా తీర్చి దిద్దుతున్నారన్నారు. 1982 లో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నాడు-నేడు పథకాన్ని ప్రవేశ పెట్టి ప్రభుత్వ పాఠశాలను సమూలంగా మార్చారన్నారు కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ సమాజంలో మంచి విద్యా విధానాన్ని అందించి బావి తరాల పౌరులుగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర వెల కట్టలేనిదని అన్నారు. భారతదేశ చరిత్రలో గురువుకు ఎక్కువ ప్రాధాన్యత ఉందన్నారు. అన్నమయ్య కలెక్టర్ గిరీశ్ మాట్లాడుతూ ఎంత అత్యున్నత స్థాయిలో ఉన్న వారందరికీ ప్రథమ గురువు ఉపాధ్యాయులేనన్నారు. విద్యార్థి దశలో చదువుకుంటున్నప్పుడు ప్రతి ఒక్కరికీ తమ హీరో టీచర్లే అని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా స్థాపించిన ఆకేపాటి ఫౌండేషనల్ ట్రస్ట్ ద్వారా రాజంపేట, కడప పార్లమెంటరీ నియోజకవర్గాలలో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ, ప్రయివేట్ ఉపాధ్యాయుల పని చేస్తున్న 400 మందికి పురస్కారాలు అందజేసి, సత్కరించి అవార్డులు అందించారు. సమావేశంలో జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, కడప, అన్నమయ్య జిల్లాల డిఇఒలు రాఘవరెడ్డి, పురుషోత్తం, మాజీ ఎమ్మెల్సీ పోచం రెడ్డి సుబ్బారెడ్డి, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం స్థానిక స్వచ్ఛంద సంస్థలు ఘనంగా నిర్వహించాయి. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, ఇంటాక్ ఉమ్మడి ఆధ్వర్యంలో సంస్థలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ రిటైర్డ్ హిందీ పండితులు కల్లూరు బాల యల్లారెడ్డి, కె.వి. రమణా రెడ్డి, రిటైర్డ్ తెలుగు పండితులు డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, పి. నాగాంజనేయులు ఉపాధ్యాయులుగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పద్మప్రియ చంద్రారెడ్డి, శంకర రెడ్డి, గొబ్బూరి కోటేశ్వర రావు, రంగా, గంగాధర్, డేవిడ్, సతీష్, బాబు, నాగేంద్ర పాల్గొన్నారు.

నగరంలోని డిప్యూటీ సిఎం కార్యాలయంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకొని, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, జాతీయ పండిత రత్న అవార్డు గ్రహీత, విశ్రాంత అధ్యాపకులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావును ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజద్ బాషా చేతుల మీదుగా మౌలానా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసై టీ అధ్యక్షుడు షేక్. అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, ఉపాధ్యాయ రత్న అవార్డును అందజేశారు.

## పబ్లిక్ యుటిలిటీ సేవలను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి - కడప :** శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవల చైర్మన్ స్వర్ణ ప్రసాద్ అన్నారు. గురు వారం శాశ్వత లోక్ అదాలత్ పబ్లిక్ యుటిలిటీ సేవల ఆధ్వ ర్యంలో కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో ప్రజా ప్రయోజత, న్యాయ సేవలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ ప్రసాద్ మాట్లాడుతూ శాశ్వతలోక్ అదాలత్, పార్టీల మధ్య వివాదంలో ఉన్న విషయాన్ని సామరస్య పూర్వక పరిష్కారం ద్వారా లేదా అర్హతల ఆధారంగా పరిష్కరిస్తారని చెప్పారు. పార్టీలు సెటిల్‌మెంట్‌కు రాకుంటే, మెరిట్‌ల ఆధారంగా అవార్డులను ఆమోదించడానికి శాశ్వత లోక్ అదాలత్‌లకు న్యాయనిర్ణేత అధికారం ఉందన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్స్, ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ ఎం. రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు 'ఉక్కు' సాధన కోసం ర్యాలీ : కాంగ్రెస్

**ప్రజాశక్తి - కడప :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 6 న ఉదయం 10 గంటలకు కడప నగరంలో స్టీల్ ప్లాంట్ సాధన కోసం నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై విష్ణు ప్రీతం రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 6న ఉదయం 10 గంటలకు కడపలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి పాత కలెక్టరేట్ వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. అనంతరం కార్నర్ సమావేశం జరు గుతుందని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు యం.యం. పల్లంరాజు, పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఎఐసిసి కార్యదర్శి సి.డి మయప్పన్, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, మీడియా సెల్ రాష్ట్ర చైర్మన్ తులసి రెడ్డి, రాష్ట్ర నేతలు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు శ్రీరాములు, చంద్ర శేఖర్ రెడ్డి, ఛార్లెస్, చెప్పలి పుల్లయ్య, బాబు,సబ్బారెడ్డి, లావణ్య, సురేష్ పాల్గొన్నారు.

## ప్రతి పిటిషన్‌పై స్టాంపు అతికించే నిర్ణయాన్ని రద్దు చేయాలి

**ప్రజాశక్తి - కడప**

ప్రతి పిటిషన్ పై రూ.20 లు స్టాంపు అతికించాలని తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం రద్దు చేయాలని, లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని కడప బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) అధ్యక్షులు జి.వి. రాఘవరెడ్డి హెచ్చరించారు. ప్రతి పిటిషన్ పై రూ. 20 లు వెల్ఫేర్ స్టాంపు అతికించాలని నిర్ణయం తీసుకోవడాన్ని నిరసిస్తూ న్యాయవాదులు గురువారం నుంచి ఈనెల 16 వరకు విధులు బహిష్కరించాలని తీర్మానం చేశారు. ఇందులో భాగంగా గురువారం విధులు బహిష్కరించి న్యాయవాదులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కడప బార్ అసోసియేషన్ హాలులో సమావేశం నిర్వహించి తగు నిర్ణయాలు తీసుకున్నారు. బార్ కౌన్సిల్ వారు ఇప్పటికైనా దీనిపై స్పందించి ప్రతి పిటిషన్ పై రూ. 20 లు స్టాంపు అతికించాలని నిర్ణయాన్ని వెంటనే సస్పెండ్ చేసి చర్చలకు పిలవాలన్నారు. సమావేశంలో కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.ఎస్. బాలసుబ్రమణ్యం, సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.వి.రాఘవరెడ్డి



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

## తేక్వాండో ఛాంపియన్‌షిప్‌లో 'ఎస్‌వి' విద్యార్థి ప్రతిభ

**ప్రజాశక్తి-కడప సిటీ :** కడప నగరంలో శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సిఎస్ఇ విభాగంలో బిటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థి పగడాల మహేష్‌బాబు తేక్వాండా ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతి కనబరిచాడు. గత నెల 29, 30 లలో గోవాలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా అతన్ని కళాశాల వైస్ చైర్మన్లు ప్రకాష్ అంబవరం, ప్రదీప్ అంబవరం, ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వీరసుదర్శన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ఎం. రవికుమార్, సిబ్బంది అభినందించారు.

## డిఇఒపై విచారణకు కలెక్టర్ ఆదేశం

**ప్రజాశక్తి- కడప అర్బన్ :** డిఇఒ రాఘవరెడ్డిపై వచ్చిన ఆరోపణలపై కలెక్టర్ విజయ్‌రామరాజు గురువారం విచారణకు ఆదేశించారు. ఇటీవల కొంత కాలం నుంచి డిఇఒపై టిడిపి నాయకులు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాం గోపాల్‌రెడ్డి గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ డిఆర్‌డిఎ పీడీ ఆనంద్‌నాయక్‌ను విచారణ అధికారిగా నియమించారు.

## జీతాల కోసం ప్రతి నెలాపడిగాపులేనా?

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు నెలవారి జీతాల కోసం ప్రతి నెల పడిగాపులుకాసి ఎదురు ఎదురు చూడడం చాలా బాధాకరమని ఎస్టిఇయు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.రమణారెడ్డి, వై.వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. కడపలోని వివిఆర్ ఎస్‌టియు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో మొండివైఖరిని ప్రదర్శించడమే కాక ప్రతి నెలా జీతాల కోసం ఉద్యోగులు వారి కుటుంబాలు కళ్లుకాయలు కాసేలా ఎదురుచూడటం పరిపాటయ్యిందన్నారు. వ్యక్తిగత రుణాలు, గృహరుణాలు తదితర రుణాలు తీసుకున్నవారు నెలసరి వాయిదాలు చెల్లించలేక బ్యాంకులకు పెనాల్టీలు కట్టడం అలవాటుగా మారిపోయిందని పేర్కొన్నారు. ప్రతి నెల ఒకటవ తారీఖున అందాల్సిన జీతాల ప్రక్రియ పదిహేనవ వరకు సాగుతుండటం అన్యాయమన్నారు. క్యాడర్ స్ట్రెంత్ సమస్యతో జిల్లాలో చాలా మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయుల ఉద్యోగుల జీతాల చెల్లింపు పట్ల నిర్లిప్తత వీడి ప్రతినెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. లేని పక్షంలో జీతాల కోసం కూడా ఆందోళన చేసే పరిస్థితులు కల్పించుకోవద్దన్నారు. సమావేశంలో రాష్ట్రనాయకులు మల్లు రఘునాథరెడ్డి, ఇలియాస్ బాషా,సురేష్ బాబు,హైదర్ వలి పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్ :** మండలంలోని నాగలకుంట్లలో ఉన్న ఎంపి పిఎస్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి పేర్కొన్నారు. గురువారం ఆయన పాఠశాలలో జరుగుతున్న నాడు- నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ నాగలకుంట్ల ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు లో భాగంగా రూ. 16 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. పనులు సక్రమంగా చేపట్టకుండా కనీసం విద్యార్థులకు బాత్రూములు కానీ, తాగునీరు సౌకర్యం కానీ కుళాయిలు కానీ లేకపోవడం దారుణమన్నారు. సుమారు 7.5 లక్షలను ప్రధానోపాధ్యాయుడు రంగారావు స్వాహా చేయడం దుర్మార్గమని వాపోయారు. తాము ప్రశ్నిస్తే మొత్తం పనులు పూర్తి చేశామని చెబుతున్నారని తెలిపారు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడిన ప్రధా నోపాధ్యాయుడిని సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కిరణ్, ప్రశాంత్, మహేష్ పాల్గొన్నారు.

## విద్యార్థినికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - వల్లూరు**

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థిని లింగాయపల్లి గ్రామానికి చెందిన బి. హేమలతకు తేజస్విని ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, ఆయన స్నేహితుల సహకారంతో రూ. 1వేల ఆర్థిక సాయం గురువారం అందజేశారు. బి. హేమలత బీటెక్ చదువు కోసం పాఠశాల ఉపాధ్యాయుల విజ్ఞప్తితో తేజస్విని ఛారిటబుల్ ట్రస్ట్ వారు ఆర్థికంగా సాయం చేశారు. కుమదబెన్ జోషి నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.వి సురేంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు ఆర్థికంగా, హార్దికంగా, భౌతికంగా సహాయం చేయడంలో తేజస్విని ఛారిటబుల్ ట్రస్ట్ ముందుంటుందని సభ్యులను అభినందించారు. పేద విద్యార్థిని హేమలతకు భవిష్యత్తులో ఉన్నత చదువు కోసం ఆర్థిక సహాయం చేస్తామని అధ్యక్షులు తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జి.వి. సాయి ప్రసాద్, తేజస్విని ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు చంద్ర పాల్గొన్నారు.



విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న సభ్యులు

## వైవీయూ బిఇడి, ఎంఇడి సెమిస్టర్ ఫలితాలు విడుదల

**ప్రజాశక్తి-కడప అర్బన్ :** యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ బిఇడి, ఎంఇడి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డితో కలిసి తన ఛాంబర్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ బిఇడి మొదటి సెమిస్టర్ పరీక్షలకు 2,203 మంది హాజరు కాగా 1,959 మంది ఉత్తీర్ణులయ్యారని , 88.92 శాతం ఫలితాలు వచ్చాయని వివరించారు అలానే ఎంఇడి ఒకటి, నాలుగు సెమిస్టర్ల పరీక్షలకు 149 మంది హాజరు కాగా 137 మంది ఉత్తీర్ణత సాధించి 91.95 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో డాక్టర్ ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.



డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుపై ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

## డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని వినతి

**ప్రజాశక్తి - బద్వేలు**

పట్టణంలో అద్దె భవనంలో ఉన్న లైబ్రరీకి సొంత భవనం మంజూరు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేయాలని గురువారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లా డుతూ పట్టణంలో గ్రంథాలయం అద్దె భవనంలో నడుస్తుందని సరైన సదుపాయాలు లేక పాఠకులు అనేక ఇబ్బందులు పడు తున్నారని పేర్కొన్నారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాలు అధికంగా ఉన్నాయని, వాటిలో లైబ్రరీకి సొంత స్థలం కేటాయించి డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని విన్నవించారు. లైబ్రరీలో గ్రూప్-1, 2 ,3,4, ఎస్ఐ కానిస్టేబుల్ వంటి పుస్తకాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధి కారులతో చర్చించి అనువైన ప్రదేశంలో అన్ని వసతులతో కూడిన లైబ్రరీని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి

**ప్రజాశక్తి-కాశినాయన**

గ్రామాలలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఐసిడిఎస్ మండల సూపర్‌వైజర్ చంద్రకళ పేర్కొన్నారు గురువారం మండల కేంద్రమైన నరసాపురంలో వెలుగు మండల సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు వెలుగు సిబ్బంది డ్వాక్రా మహిళలు ర్యాలీ చేస్తూ తక్కువ వయస్సు గల ఆడపిల్లలకు వివాహాలు చేయొద్దని, బాల్య వివాహాలు నిర్మూలించి వారి జీవితాలను కాపాడుదామని చెప్పారు. చిన్న వయస్సులోనే వివాహం చేస్తే అనేక రకాలైన నష్టాలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో తెలుగు ఎపిఎం వీరాంజనేయులు, మండల సమైక్య అధ్యక్షురాలు నజీమా, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు

## 8న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

హైదరాబాద్‌కు చెందిన అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈనెల 8న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఐఎంఎ హాలులో వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు. రూ.9 వేలు విలువచేసే వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి రోబోటిక్ టచ్ లెస్ లాసింగ్ సర్జరీ చేస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## గ్రామాల్లోనే నాణ్యమైన వైద్యం

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

పేదలపై ఆర్థికభారం పడకుండా గ్రామాల్లోనే నాణ్యమైన వైద్యాన్ని వైసిపి ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్ర స్థాయిలోనే గుర్తించి, అక్కడే వైద్యం చేస్తున్నారన్నారు. తహశీల్దార్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వారు వైద్య సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రంతులయ్య, జెడ్‌పిటిసి బాలయ్య, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, సర్పంచ్, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు ప్రతాప్, రఘునాథరెడ్డి, ముస్తఫా, రామాంజనేయులరెడ్డి పాల్గొన్నారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సింహాద్రిపురం :** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైసిపి మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోరగుంటపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి అరుణ, మండల ప్రత్యేక అధికారి నాగభూషణాచార్యులు, ఎంపిడిఒ కృష్ణమూర్తి, తహశీల్దార్ మహబూబ్ బాషా, వైసిపి నాయకుడు శివారెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

**పులివెందుల టౌన్:** ఇంటి వద్దకే వైద్యం అందాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఎంపిడిఒ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని ఇ.కొత్తపల్లి పంచాయతీ మొట్నూతలపల్లి, చంద్రగిరి, కొత్తపల్లి గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన రోగులకు మందులు పంపిణీ చేశామని వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ లిఖిత, ప్రధానోపాధ్యాయులు శివశంకర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు సతీష్, జగదీష్, సచివాల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**కొండాపురం:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం మండలంలోని కొత్తపల్లె పంచాయతీ పరిధిలో నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో డాక్టర్లు సాంబశివారెడ్డి, భాస్కర్‌రావ్, భారతి, జయంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది ఏర్పాట్లు చేశారు. మండల ఉపాధ్యక్షుడు జి.విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. సాధారణ పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారని పర్యవేక్షణ అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

**పెద్దముడియం :** మండల పరిధిలోని భీమగుండం గ్రామంలో గురువారం ఎంపిడిఒ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వారికి ఆరోగ్య పరీక్షలతోపాటు కంటి అద్దాలను అందజేశారు. తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి, మండల వైద్యాధికారులు, ఆశా వర్కర్లు, గృహసారథులు, వైసిపి నాయకులు రాఘవేంద్రరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

## 'ఉపాధి' సిబ్బంది బదిలీ

**ప్రజాశక్తి - దువ్వూరు**

మండలంలో పనిచేస్తున్న ఉపాధి హామీ చట్టం ఎపిఒ రామచంద్రారెడ్డి మైదుకూరు మండలానికి, ఇసి విజయ్‌కుమార్ మైలవరానికి, కంప్యూటర్ ఆపరేటర్లు అనూరాధ ఎర్రగుంట్లకు, సి.రాజు ఎపిడి మైదుకూరు కార్యాలయానికి, టెక్నికల్ అసిస్టెంట్ బాలనాయక్ ఒంటిమిట్టకు ఆంజనేయులు చాపాడు, రమేష్ మైదుకూరు మండలానికి బదిలీ అయ్యారు.

## పాదయాత్ర విజయవంతానికి కృషి చేయాలి

**ప్రజాశక్తి - ఖాజీపేట**

రాష్ట్రవ్యాప్తంగా శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ చేస్తున్న మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్ కో-కన్వీనర్ వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అందరి ఐక్యతతోనే ఎస్‌సి వర్గీకరణ సాధ్యమవుతుందన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో అందరూ తరలివచ్చి పాదయాత్ర చేరుకొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## బుడ్డ శనగలు మంజూరు

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

మండలానికి 5,350 క్వింటాళ్ల బుడ్డ శనగలు మంజూరైనట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శివ మోహన్‌రెడ్డి తెలి పారు. గురువారం మండలంలోని కసనూరు, బలపనూరు గ్రామాలలోని ఆర్‌బికెలకు బుడ్డ శనగలు చేరాయి. వీటిని త్వరలోనే రైతులకు పంపిణ చేస్తామన్నారు.



మండలానికి చేరిన బుడ్డశనగలు

**రాయితీతో బుడ్డ శనగలు పంపిణీ**

**కొండాపురం :** 2023 రబీ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం రైతులకు రాయితీతో బుడ్డ శనగలను శుక్రవారం నుంచి పంపిణీ చేయనుంది. బుడ్డ శనగ క్వింటా పూర్తి ధర రూ.8,100 కాగా 40 శాతం రాయితీతో రూ.3,240 ఉండగా, రైతు వాటా రూ.4,860 చెల్లించాల్సి ఉందని ఎఒ ఎవి రామాంజల్‌రెడ్డి తెలిపారు. 0.5ఎకరా సాగుభూమిగల వారికి 20కిలోలు కలిగిన ఒక బస్తా, ఒక ఎకరం ఉన్నవారికి రెండు బస్తాలు ప్రకారం సాగు భూమి విస్తీర్ణం బట్టీ అధికంగా ఐదు ఎకరాలు ఉన్నవారికి పది బస్తాల వరకు రాయితీ విత్తనాలు పొందవచ్చునని తెలిపారు. రాయితీ పొందిన రైతులు తప్పనిసరిగా పంటను సాగు చేసి ఇ క్రాప్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పాసుబుక్, ఆధార్ కార్డు జిరాక్స్, సెల్ ఫోన్ తీసుకొని సంబంధిత రైతు భరోసా కేంద్రానికి వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు.

# క్రైం కార్నర్

## విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని సీతారామపురంలో గురువారం విద్యుదాఘాతంతో ఓ మహిళా రైతు మృతి చెందారు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. ఉప్పలూరు లక్ష్మీదేవి (39) అనే మహిళా రైతు గురువారం ఉదయం తన పొలంలో గడ్డి కోస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురైంది. అక్కడున్న వారు గమనించి లక్ష్మీదేవిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గడ్డిలో విద్యుత్ తీగలు ఉండ డంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మృతురాలికి ఒక కుమార్తె, కుమా రుడు కాగా, గతేడాది కుమార్తెకు వివాహమైంది. లక్ష్మిదేవి భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.



మృతురాలు లక్ష్మీదేవి

## ఆరుగురు జూదరులు అరెస్టు

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

మండలంలోని జంగంరెడ్డిపల్లెలో జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు కంపచెట్లలో జూదం ఆడుతున్న వారిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.15,300 నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

# పేదలకు పప్పుచారు కరువే..!

## ఆరు నెలలుగా రేషన్‌షాపుల్లో కనిపించని కందిపప్పు - బయట మార్కెట్‌లో కొనలేని పేదలు





**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

మార్కెట్లో నిత్యావసర ధరలు మండిపోతున్నా.. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు ప్రభుత్వం తీసుకోవడం లేదు. తెల్లకార్డుదారులకు రాయితీపై అందించే కందిపప్పు గత 6,7 నెలలుగా పూర్తిగా నిలిచిపోయింది. పంచదార సైతం చాలా చోట్ల సక్రమంగా పంపిణీ కావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా కందిపప్పు సరఫరా నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో సామన్యులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. సెప్టెంబర్‌కు సంబంధించి కందిపప్పు సరఫరా కాలేదు. అక్టోబర్ నెలలోనైనా కందిపప్పు సరఫరా అవుతుందని పేదలు ఆశతో ఎదురుచూస్తున్నారు. రాయితీపై 6 నెలలగా కందిపప్పు అందుతుందని కార్డుదారులు ఎదురుచూశారు. పేదలు పప్పు బువ్వకు కూడా నోచుకోవడంలేదు. పచ్చళ్లతో కాలం గడపాల్సి వస్తుందని కంటనీరు పెడుతున్నారు. అసలే కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశానంటుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలు జీవనం సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రాయితీపై అందించే సరకుల కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం పేదలకు అందాల్సిన సరకుల్లో ఒక్కొక్కటిగా తగ్గిస్తోంది. 6 నెలలుగా కందిపప్పు పంపిణీ చేయలేదు. కార్డుదారులకు బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ప్రొద్దుటూరు అర్బన్, రూరల్ వ్యాప్తంగా 43 ఎండియు వాహనాలుండగా.. వీటి పరిధిలో 68,984(కొత్త కార్డులతో కలిపి) బియ్యం కార్డులున్నాయి. ఆయా కుటుంబాలకు ప్రతినెలా బియ్యంతో పాటు అర కిలో పంచదార, కిలో కందిపప్పు ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. ప్రతినెలా 55 మెట్రిక్ టన్నుల కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉంది. రాయితీపై ప్రతి కార్డుకు రూ.67 ప్రకారం అందించేది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో దీని ధర రూ.160 నుంచి రూ.180 వరకు ఉంది. వరుసగా 6,7 నెలల నుంచి కందిపప్పు సరఫరా లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పప్పును మరిచిపోయాం..**



గతంలో ప్రతినెలా కందిపప్పు పంపిణీ చేసేవారు. వారంలో రెండు రోజులైనా పప్పు చారు చేసుకునేటోళ్లం. 6,7 నెలల నుంచి కందిపప్పు పంపిణీ చేయడమే ప్రభుత్వం నిలిపివేసింది. ఈ పరిస్థి తుల్లో పప్పుచారు చేసుకోవడమే మానుకున్నాం.

**- బి.సుశీలమ్మ, ప్రొద్దుటూరు**

**ప్రభుత్వం నుంచి వస్తే పంపిణీ చేస్తాం..**



ప్రభుత్వం నుంచి కందిపప్పు సరఫరా లేదు. వస్తే కార్డుదారులకు పంపిణీ చేస్తాం. ప్రస్తుతానికి అంగన్వాడీ కేంద్రాలకు మాత్రమే సరఫరా వచ్చింది. బియ్యంతోపాటు, పంచదార పంపిణీ చేస్తున్నాం.

**- సుదర్శన్, గోడౌన్ డీటీ, ప్రొద్దుటూరు**

## గిరిజనులంటే అధికారులకు చిన్నచూపు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

గిరిజనులంటే అధికారులకు చిన్న చూపని రిలే నిరాహార దీక్షలు చేపట్టి మూడు రోజులవుతున్న అధికారుల స్పందన లేదని సుందరయ్య కాలనీ ఎస్‌టి ఎరుకలవాడ వాసులు వాపోయారు. రిలే నిరాహార దీక్షలకు స్పందనలేదని గురువారం ఏడుమంది కాలనీ వాసులు వెంకటరమణ, చిన్న గంగాధర్, లక్ష్మి, సరోజ, రంగమ్మ, నాగమ్మ, గంగమ్మ, ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఆర్‌డిఒ, తహశీల్దార్ శిబిరం పక్కను తిరుగుతున్న ఏమిటి మీ సమస్య అని అడగలేదన్నారు. స్థానిక మూడవ పట్టణ సిఐ శిబిరం వద్దకు వచ్చి ఇది ప్రభుత్వ స్థలం ఇక్కడి నుండి దీక్షలు చేయకూడదని, తక్షణం ఇక్కడి నుండి ఖాళీ చేయాలని అంటున్నారన్నారు. అధికారులు తమపై దయ చూపకపోవడంతో రిలే నిరాహార దీక్షలు ఆమరణ నిరాహార దీక్షలుగా మారాయన్నారు. జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఆందోళనలో కాలనీవాసులు బయన్న, రంగన్న, నారాయణస్వామి, నాగేషు, కృష్ణమూర్తి, రామక్క, పెద్దక్క పాల్గొన్నారు.



నిరవధిక నిరాహార దీక్షలో సుందరయ్య ఎస్‌టి కాలనీ వాసులు

## గృహ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరిస్తాం



గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని అమృత్ నగర్‌లో ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారుల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి హామీ ఇచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అమృత్ నగర్‌లో 2008లో 2000 మంది పేదలకు ఇంటి స్థలాలిచ్చారన్నారు. వీరు తమ సొంత ఖర్చులతో బేస్‌మట్టాలేసుకున్నప్పటికీ వీరి గురించి అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అదనంగా మరో 500 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేశారన్నారు. వీటిని రద్దు చేసి వీరికిచ్చిన స్థలాల్లోనే 2018లో మరో 400 మందికి ఆ స్థలమే మంజూరు చేయడంతో అంతా గందరగోళంగా తయారైంది. ఈ క్రమంలో పేదల సమస్యలపై తాము గత నెలలో ధర్నా నిర్వహించగా ఎంపిపి చొరవతీసుకొని కేటాయించిన స్థలాలను పరిశీలించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థలాన్ని మొదట చదునుచేయాల్సి ఉందన్నారు. నీటి, విద్యుత్ సదుపాయం కల్పిస్తామన్నారు. అనంతరం ఎవరికి కేటాయించిన స్థలంలో వారు ఇళ్లను నిర్మించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో ఎంపిపి శేఖర్‌యాదవ్, గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సమాజం బాగుండాలని కోరే తొలి వ్యక్తి ఉపాధ్యాయుడు



సన్మానగ్రహీతలతో ఉపాధ్యాయులు, అధికారులు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

సమాజం బాగుండాలని ఆకాంక్షించే తొలి వ్యక్తి ఉపాధ్యాయుడని సర్వశిక్షాఅభిమాన్ ప్రాజెక్ట్ అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో అవార్డీ టీచర్స్ అసోషియేషన్‌తోపాటు సంస్కృతి స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ కవి గానుగపెంట హనుమంతరావు అధ్యక్షత వహించిన ఈ సభకు ముఖ్యఅతిధిగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మార్కులే పరమావధి కాకుండా విలువలనను కూడా బోధించాలన్నారు. అనంతరం ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు స్వీకరించిన 30 మంది ఉపాధ్యాయులను ఎంఇఒలు సావిత్రమ్మ, శోభారాణి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో అవార్డీ టీచర్స్ సంఘ నాయకులు కె.ఎల్.వి. రమణయ్య, రాయలసీమ వ్యాయామ శిక్షణా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిశంకర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కేశవరెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాద్యాయ అవార్డు గ్రహీతలు విజయ మోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు అంకాల్ కొండయ్య, ఎపిసిపిఎస్ ఇఎ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం అధ్యక్షులు ఎస్.ఆర్.జనార్ధన్‌రెడ్డి, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**చాపాడు :** మండలంలోని పలువురు ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. జిల్లా పరిషత్ సభా భవనంలో జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రదానం చేశారు. అయ్యవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి డి భాస్కరరావు, అన్నవరం నుండి చాబోలి దేవేంద్రుడు, మడూరు ప్రాథమిక పాఠశాల నుండి శారద, పల్లవోలు పాఠశాల నుండి వెంక టేశ్వర్లును ఎంపిక చేసి సన్మా నించారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపా ధ్యక్షులు శ్యాం సుందర్‌రెడ్డి, ఎంఇఒలు రవి శంకర్, వంశీకృష్ణ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. **వేంపల్లె :** వేంపల్లెలోని వికాస్ స్కూల్ ఉపాధ్యా యురాలు రఫీయా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం కడప జడ్పీ సభా భవనంలో ఆకేపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఛైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి ఈ అవార్డును అందజేశారు. కడప మేయర్ సురేష్ బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, డిఇఒ రాఘవరెడ్డి ఆమెను ఘనంగా సత్క రించారు. ఉషాకిరణ్ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న నాగేశ్వరరావుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం సంతోషకరంగా ఉందని ఆ పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆకేపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఛైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి ఈ అవార్డును నాగేశ్వరరావుకు అందజేశారు.

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

**ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** బాల్య వివాహానికి ఏర్పాట్లు చేస్తుండగా ఐసిడిఎస్ అధికారులు అడ్డుకున్న సంఘటన గురువారం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో చోటుచేసుకుంది. శ్రీరామ్‌నగర్ చెందిన 19ఏళ్ల అబ్బాయికి, 17ఏళ్ల అమ్మాయికి వివాహం చేయాలని నిశ్చయించారు. ఈ సమాచారం అందుకున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి వారి తల్లి దండ్రులను తహశీల్దార్ కార్యాలయానికి పిలిపించి కౌన్సెలింగ్ ఇప్పించారు. వివాహం రద్దు చేసుకుంటామని తల్లిదండ్రులు చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పుష్పజ, మహిళ పోలీస్ సునీల పాల్గొన్నారు.

## నేడు అల్లాడుపల్లెలో ఎమ్మెల్యే పర్యటన

**ప్రజాశక్తి - చాపాడు**

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అల్లాడుపల్లె గ్రామంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పర్యటించనున్నట్లు ఎంపిడిఒ శ్రీధర్‌నాయుడు తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఏవైనా సమస్యలుంటే ఎమ్మెల్యే దృష్టికి తేవాలని ప్రజలకు సూచించారు. సచివాలయం సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, వాలంటీర్లు అందుబాటులో ఉండాలని సూచించారు.

## కృషితో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

**ప్రజాశక్తి - చాపాడు**

విద్యార్థులు కృషితో ఉన్నతస్థాయికెదగాలని వక్తలు పేర్కొన్నారు. సిబిఐటి కళాశాలలో గురువారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా టిసియస్ గ్లోబల్ హెడ్ ఇయస్ చక్రవర్తి, నెల్లూరు గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి దండ్రులు పిల్లలను ఇంజనీరింగ్ చేర్చిన తర్వాత వారి గురించి ఆలోచించరని, కాని జాగ్రత్త తీసుకోవలసింది అక్కడే అని తెలిపారు. అతిధులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీని వాసులరెడ్డి, చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ప్రసన్న వెంకటేషన్, లోహిత్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న సిబిఐటి కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి



## సిఎం జగన్ పాలన ఆదర్శనీయం

**ప్రజాశక్తి - ఖాజీపేట**

సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఆదర్శనీయమని, దీన్ని అందరూ అభినందిస్తున్నారని ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పుల్లూరు సచివాలయ పరిధిలో రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలను గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా కలెక్టర్ విజయ్‌రామరాజు, వ్యవసాయ శాఖ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య సేవలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, ఎంపిపి అబూబకర్ సిద్దిక్, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, మండల నాయకులు ఇరుగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షులు పివి రాఘవరెడ్డి, అధికారులు, అభిమానులు, వైసిపి నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో కలెక్టర్, ఎమ్మెల్యే, నాయకులు

## అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి - చాపాడు**

గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి లక్ష్మయ్య తెలిపారు. మండల పరిధిలోని ఖాదరపల్లె గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని స్టాల్స్ రూపంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పౌష్టికాహార లోపం లేకుండా అందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ ప్రభుత్వం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సురేష్‌రెడ్డి, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, వైద్యులు ఓబులేసు, వైసిపి నాయకులు రామ్మోహన్‌రెడ్డి, జైనుల్లా, బొలెరో బాషా, వైద్య సిబ్బంది రాఘవయ్య, మహదేవ యాదవ్, భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బండి శ్రీరామరెడ్డి నేత్రదానం

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

పులివెందుల భాకరాపురానికి చెందిన బండి శ్రీరామరెడ్డి (75)కి సంబంధించి నేత్రదానం చేశారు. శ్రీరామరెడ్డి బుధవారం రాత్రి మృతి చెందడంతో ఆయన భార్య సులోచనమ్మ, కుమారుడు రవిశంకరరెడ్డి, కోడలు సుజాత, కుమార్తెలు పద్మావతమ్మ, సునీత, అల్లుళ్ళు శివప్రసాద్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి నేత్రదానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం ఇవ్వడంతో టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కుటుంబ సభ్యులు లేదా సన్నిహితులు ఎవరైనా మరణిస్తే 99665 09364, 70932 04537నంబర్లకు సమాచారమిస్తే వారి నుంచి కార్నియాలను తొలగించి, వేరొకరికి కంటి చూపునిస్తామన్నారు. నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులకు సేవాసమితి పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, బృందం కృతజ్ఞతాభినందనలు తెలిపారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

మద్యం సేవించి పాఠశాల వాహనాలను నడిపితే అలాంటి డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ ఈశ్వరయ్య హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ప్రైవేటు పాఠశాలల వాహనాల డ్రైవర్లకు, పాఠశాల కరస్పాండెంట్లకు విద్యాశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మొన్న జరిగిన ప్రమాద ఘటన మళ్లీ పునరావృతం కారాదని తెలిపారు. డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాల కండిషన్ చూసుకోవాలన్నారు. సమస్య ఉంటే యాజమాన్యానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని తెలిపారు. పరిమిత వేగంతో మాత్రమే వాహనాన్ని నడపాలన్నారు. ఎంఇఒ శివప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం కూడా వాహన కండిషన్‌ను డ్రైవర్ ద్వారా తెలుసుకుంటూండాలని సూచించారు. మద్యం సేవించి నడిపే డ్రైవర్లను విధుల్లో ఉంచరాదన్నారు. లైసెన్సు లేని డ్రైవర్లను విధుల్లో చేర్చుకోరాదని పాఠశాల యాజమాన్యానికి తెలిపారు.

## గ్రామీణాభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయం

**- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి**

**ప్రజాశక్తి - పొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామసీమల ప్రగతికి ప్రాధాన్యతను కల్పిస్తున్నారని, గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. గోపవరం పంచాయతీ పరిధిలోని యానాది కాలనీలో రూ.70 లక్షలతో నిర్మించనున్న డ్రయినేజీ పనులకు గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి పాలనా వ్యవస్థలో విప్లవాత్మక మార్పును తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో గోపవరం సర్పంచ్ మోషే, ఉపసర్పంచ్ రాఘవేంద్రారెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగ శేషారెడ్డి, ఒరికూటి ఓబుల్‌రెడ్డి, ఎంపిపి శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

## మండల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

బ్రహ్మంగారిమఠం మండల సమాఖ్య వార్షిక మహాసభ సమావేశాన్ని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం అధ్యక్షురాలు సౌజన్య అధ్యక్షతనలో మండల సమాఖ్య ఎపిఎం జి ప్రకాష్‌రావు పర్యవేక్షణలో నిర్వ హించారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా డిఆర్‌డిఎ వెలుగు ఐబి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ హరప్రసాద్ రాజు, ఎన్‌ఆర్ఎల్ఎం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చిట్టిబోయిన రెడ్డెయ్య హాజరయ్యారు. హరప్రసాద్ రాజు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు అభివృద్ధి బాటలో నడవడానికి గ్రామ సంఘం అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు. రుణాలతో జీవనోపాధులను చేపట్టి, తద్వారా వచ్చే ఆదాయం వల్ల డ్వాక్రా మహిళలు వారి కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. చిట్టిబోయిన రెడ్డయ్య మాట్లాడుతూ ప్రస్తుతం మహిళా సంఘాలకు ఎన్‌ఆర్ఎల్ఎం ప్రాజెక్టు ద్వారా నిధులు వస్తున్నాయని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల సమాఖ్య ఎపిఎం జి ప్రకాష్‌రావు మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో- ఆర్డినేటర్లు కె.భాస్కర్, ఎ.అనంతయ్య, ఎస్. బాలయ్య, డి. నారాయణరావు, ఎల్‌సి జి. రఘునాథ్, గ్రామ సంఘం అసిస్టెంట్లు, గ్రామ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.